


మధు పరీక్షలో కృతార్థుడైనాడు

నేడు వెలువడిన పరీక్షా ఫలితాల్లో మధు క్రమసంఖ్య మొదటిస్థానంలో వుండడంచూచి భారతి పరమానంద భరితురాలైంది. అంత ఆనందం తనకు తెలియకుండా ఇంతకు ముందెపుడూ ఆమె పొందలేదు స్వయంగా వెళ్లి మధుకు ఈవార్త వినిపించడానికై ఉబికివచ్చే ఉల్లాసంతో పరుగుతీసింది ఊరి బయటవుండే ఆశ్రమం కట్టు.

'బాబయ్యా! మధు వున్నాడా?"

"లేదు తల్లీ! ఇపుడే దేవాలయానికి వెళ్ళాడు, తమరే వచ్చినారా కబురుచేసింటే నేనే మధును పంపించి వుందునే" అంటూ బాబా ముందుకువచ్చి వినయంతో అన్నాడు కానీ' బాబాకు జవాబిచ్చే ఓపిక అప్పట్లో ఆమె కెక్కడిది! తిరిగి పరుగెత్తింది. వేగ్రగా దేవాలయంవైపు బాబా ఆశ్చర్యంతోచూస్తూ నిలబడ్డాడు, వెనక్కిపోతూ బాబా తట్టుచూచి చేయి వూపుతూ అన్నది భారతి,

"బాబా మధు ఉత్తీర్ణుడైయ్యాడు."

ఆశ్రమానికి కొద్దిదూరంలో రోడ్డు ప్రక్కనే వున్నది దేవాలయము, గుడి తలుపులు తెరచియుంచినాడు, దీపం వెలుగుతున్నది లోపల, కానీ మధులేడు బహుశా రోజూ సాయంత్రం పూట వెళ్లేచుండే తావుకుపోయి వుంటాడు.

భారతి పరుగెత్తింది నది ఒడ్డు ఇసుకతిన్నె తట్టు

పడమటి సూర్యుని పండు కిరణాలు పెన్న లోపడి దొర్లాడుచున్నవి. బంగారు పోతవలె పెన్న జలధార జల జల జారిపోతున్నది. పచ్చగ పెరిగి పెటపెటలాడే చెఱకుతోటల మధ్య, ఇసుక తిన్నపైకూర్చొని వున్నాడు మధుహరి. దూరాన, గుడిగోపురంపై, సంజ కెంజాయలుపడి, మిలమిలా మెరిసిపోయే బంగారు కలశాన్ని మధు చూపులు ముద్దిడుకుంటున్నాయి

మధూ! మధూ!!

భారతి పరుగెత్తుకుంటూవచ్చి పడింది యిసుక తిన్నపై

"మరిగావుతే మంచితావు అబ్బ! చచ్చిపోయాను వెతుకలేక."

"ఏమిటా తొందర?"

"వుండనీకాసి నాకాయాస్త్రవుచెప్పా ముందుగా"

"ఎందుకూ?"

'నీకో మంచిమాట చెపుతాను."

"నీ నోట్లోనుంచి వెలువడే ప్రతిపలుకూ నాకు అమృత తుల్యమే."

"కాదు, ఈవేళ ప్రతిఫలం ముట్టజెప్పందే విడువను."

"నీకు ప్రతిఫలము ముట్టచెప్పేవాడుకే పెట్టికొని ఉండవుంటె, ఈవేళకు నన్నుదోచేసి వుందువు."

"దోచుకోటానికి దారి యిస్తేగా?"

"అది ప్రకృతికి విరుద్ధం."

"అంటే?"

"అంటేనా? పురుమనికి, స్త్రని దోచుకోవడం, స్త్రీకి త్యాగం చెయ్యడం ప్రకృతిసిద్ధం, అందులోనే వారికి ఆనందము తెలిసినదా?"

"ఓహో! అట్లనా, మరి ఈపాఠం ఎవరు నేర్పారు తమకు?"

"భారతి నేర్పింది."

మధు మాటకు భారతియొక్క పెద్ద పెద్ద కనుల్లో సంతోషం తొంగిచూచింది. ఆమె పైకిలేచి, కొంచెము వంగి, తన రెండుచేతుల్తో మధు ముఖాన్ని తన వైపుగా త్రిప్పి అతని కన్నుల్లోకిచూస్తూ అన్నది.

'మధు బాబూ! నీవు ప్రధమశ్రేణిలో ఉత్తీర్ణుడయి నందుకు భారతి నిన్ను అభినందిస్తున్నది. అనుగ్రహించెదరా?"

'భారతీ! నేను నిన్ను అనుగ్రహించడమేమిటి? ఇది యంతయూ నీ అనుగ్రహఫలమే ....ఒక చిన్నగుడిలో దీపము వెలిగించి పొట్ట

బోసుకునే నాబోటి పూజారి, నిన్ను....''

తృటిలో, మధు ముఖాన గంభీరత అవ రించినది. భారతికి అతని చూపుల్లోని కృత జ్ఞతా పూర్వకమైన విచారరేఖలు కన్పడ్డాయి. తాను తలంచినట్లు భారతి ఈవా_త్తవల్ల మధు ముఖ కవళికలో మార్పు తీసుకరాలేక పో యింది. అతని ముఖమండలాన్ని ఆవరించిన పూర్వపు విచారరేఖల్నిచూచి ఆమె హృదయం తల్లడిల్లినది మధు మనోవ్యాధిని మాన్పడ మెట్లన్నదే ఆమె విచారం కొద్దిసేపు ఎవరూ మాట్లాడలేదు, భారతి పిలచింది బా ంతో.

"మధూ!''

మధు ఆమెవైపు ప్రశ్నార్థకంగా చూచాడు.

''ఒక్కమా టింటావా?''

' ఎప్పుడు కా దన్నాను?''

'నామైఒట్టు,నేచెప్పినట్టు వింటావుగదూ?''

''ఏమిటో చెప్పరాదూ!''

విద్యార్థి ఉద్యమమనీ, కాంగ్రెసు, రైతు, కూలీ సంఘాలంటూ పిచ్చి, పిచ్చి భావాల్లోపడి నీవు ఈలాగు అనమానం కృశించిపోతూ వుం డటం నేను చూడలేను ''

''అయితే! యేమి చెయ్య మంటావు?''

''ఏలాగో మెట్రిక్యులేషన్ పాసుచేసినావు గదా?''

''ఆ! చేసినాను ''

''నే చెప్పినట్టువిని, కాలేజీకివెళ్లి చదువు సాగించు.''

'డబ్బో ''

' ఆ విచారం నీకువద్దు ''

''లేదు భారతీ! నీకు ఎంత చెప్పినా అర్థం కాదు అమాయికవు ప్రస్తుత దేశస్థితినిబట్టి నాబోటి ఒక యువకుడు, యిరువది నాల్గు ఘంటలూ కుర్చీలపై కూర్చొని డబ్బు యెగు రజల్లుతూ, డిగ్రీలకొఱకు సమయాన్ని వ్యర్థ పెట్టవలసిన సమయంకాదు. చూ డూ....

''మధూ!'' భారతి అతని మాటలకు అడ్డు పడి కట్టిగ గద్దించి అరచింది.

''నీ కవితా గీతాలు ఇక ఆలాపించకు! బాగా నేర్చావు. నీవు పోయే మార్గంవల్ల బాధ పడేది నీవు ఒకనివేకాదు, నీ వెనకాల

భారతి స్వరంలో, బాధ, విచారమూ, వేద నా, వివశత, ఒక్కసారిగా ధ్వనించాయి. ఆమె మళ్ళీ చెప్పలేక పోయింది మధు ఏదో గంభీరంగా అస్తమించే సూర్యునివేపు చూస్తూ న్నాడు. వెంటనే మధు మనస్సును నొప్పిం చాననీ, ఆమె అనుకొన్నది మధు విచారానికి ఆమె భయపడింది ఇంతలో ఆమెకు ఒక చిన్న ఉపాయం తట్టింది. ఏదో విచిత్ర వస్తు వుచూచి ఆదిరిపడినట్లు, ఆతురతతో అర చింది.

''మధూ మధూ! ఇటుచూడూ: ఇటూ!''

మధు చకితుడై వెను తిరిగిచూచాడు ఆమె ప్రక్క కానీ అతనికేమీ కానరాలేదు

''ఏమిటి చూడడం?''

''ఇక్కడ చూడు,

''ఎక్కడ? ఎవర్ని: యేమిటి?''

భారతి, తన్ను, తనచేతిలో చూపించు కొనుసూ అన్నది పరిహాసంగా

''ఇదిగో! ఇక్కడ! ఈమెను! ఈ భారతిని చూడూ!''

ఆమె చిలిపిచేష్టకు మధు నవ్వాడు ఆమె నవ్వింది. యిద్దరూ నవ్వుకున్నారు. వారి కిల కిలలకు చుట్టుపట్ల వాతావరణం కళ కళ లాడింది.

''నే నిక్కడ గూబవలె కూర్చొనివున్నాను యేమీ కాబట్ట నట్లు నీవు ఆకాశంతట్టుచూస్తూ కూర్చుంటే—నేను చచ్చాననా? లేక బ్రతికా ననా?'' అంటూ ఆమె మధు భుజాలను పట్టి పైకి లేపింది. యిద్దరు బయలు దేరారు పూరి వైపు గుడి ముందరికి వచ్చునప్పటికి—

''దీపంలో నూనెవేసి దేవాలయం తలు పులు మూసివస్తా'' నంటూ మధు గుడిలోకి వెళ్లాడు.

''పరీక్షలో ఉత్తీర్ణుడవై నందుకు, పూజారీ! దేవికి యేమీ అర్పిస్తావు?'' అంటూ అతని వెనకాలే భారతిగూడ నడచింది.

''ఇదిగో'' నంటూ మధు ఒక పళ్లెరంలో, దేవిపాద కుంకుమ, పూలుతెచ్చి ఆమె ముం దుకు చాచుతూ ''మొదట ఈదేవికి ఫలం,

పుష్పం, అర్పిస్తేగా ఆ దేవికి బీద పూజారి యిచ్చే ప్రతిఫలం.''

''పిచ్చి పూజారీ! ప్రతిఫలం తీసుకోఐడదు అది యివ్వ బడుతుంది ''

''అంటే?'' మధుకు అర్థం కాలేదు.

,,పూజా విధులు తెలియని నీబోటి ఆ మా యక పూజారికి, యింకేమని చెప్పాలి?,, అంటూ ఆమె తన ముఖం పైకెత్తి అతని ఎ దుట నిలబడినది మధు ఆమె మాటలోని అంతర్యాన్ని గ్రహించి పళ్లెరంలోని కుంకుమ తీసి ఆమెనొసట దిద్దినాడు పిమ్మట తిలక ధారిణి భారతి వెనక్కు తిరిగి నిలబడింది. మధు రెండు గన్నేరు పుష్పాలు ఆమె తలలో చెక్కాడు దీపం వెలుతురుకు ఆమె తలలో ముడిచిన ఎఱ్ఱగన్నేరు పూలు తళతళ లాడా యి దేవిగారి అల్పసంతోషానికి పూజారి పొంగిపోయాడు

మధు గుడిలో కర్పూరం వెలిగిస్తున్నాడు, కమ్మని తావితో కర్పూరధూపం గర్భగుడిని ఆవరించుకున్నది భారతి ఒకమారు దీపం కేసి, మరొకమారు గోపురద్వారంలో గుండ- నరిగా తనకు యెదుట, కన్పించు అస్తమిస్తుం డే సూర్యబింబాన్నిచూచి యేదో జ్ఞాపకానికి వచ్చి మధును పిలచింది

అతను దగ్గరకువచ్చి నిలబడ్డాడు తన వ్రేలిపైనున్న ప్రాతగాయాన్ని మధుకు చూపె డుతూ ''మధూ! నీకు జ్ఞప్తివున్నదా! ఈ దెబ్బ యెపుడు తగిలిందో?''

''ఎపుడు తగిలింది? ఎవరు కొట్టారు?'', అని మధు ఆశ్చర్యంతో అడిగాడు.

''ఈ దేవాలయంలోనే, నీయెదుట, నీవు చూస్తూండగానే ''

''ఏమిటీ! నా సమక్షంలోనా? మరి....''

''మరి నీకు జ్ఞప్తికి యెందుకుంటుంది! దెబ్బతిన్న నేను యెలా మరవగలను ', అంటూ ఆమె అతని భుజంమీద చేయి వేసింది.

''ఇది మూడేండ్లనాటి పాతగాయం, ఇప్ప టిదికాదు, నేను మద్రాసు నుండివచ్చిన తొలి రోజులవి. ఒకదినం వంటరిగా దేవాలయానికి

వచ్చాను. బహుశా, ఆరోజు మా అమ్మ సాంవత్సరికం కాబోలు. నేను పూజ చేసుకుంటున్నాను, ఎవరో కొత్తగా పరీక్షకు వెళ్ళివచ్చిన అబ్బాయిగా వుండొచ్చు నాప్రక్కన దేవి యెదుట నిశ్శబ్దంగా నిలబడి వుండినాడు. ఇంతలో యేం జరిగినదంటే, నా యెడమచేతిలో చిన్నరాయి వుంచుకొని, కుడిచేత్తో కొబ్బరికాయ కొట్టబోయి, వ్రేలిమీద కొట్టుకున్నాను వ్రేలుపగిలి రక్తం అమాంతంగా కారిపోతున్నది. ఆ దృశ్యానికి కండ్లు చెదరి, క్రిందపడిపోయాను."

"ఆ! పిమ్మట యేం జరిగింది?"

"పిమ్మటనా? నా ప్రక్కన ఇంతవరకు నిలుచుండిన ఆ కుర్రోడు తన ధోవతిచించి క్రింద బడ్డ టెంకాయ నీటితో తడిపి నా వ్రేలికి కట్టు గట్టిలేపాడు. కొన్ని రోజులకు అతను పూజారియని తెలుసుకొని మండి పడిపోయాను."

"అతను చేసిన తప్పేమిటి?"

"ఏమిటో నిజంగా అతనిపై నాకు ఆనాడు అమితమైన కోపం కలిగింది."

"అయితే, ఇపుడా పిల్లపూజారి తమ సమక్షంలోనే వున్నాడు శిక్ష విధించండి,' అన్నాడు మధు నగుచూ

"ఇందుకు శిక్షనా? అతనిని వెంటనె పూజారి పనినుండి తొలగించి వేయదలచాను."

"దేవిగారు మనస్పూర్తిగా సెలవిస్తున్నారా?"

"విధిలేదు మధూ! నీవు తప్పక మద్రాసు వెళ్లాలి" అని భారతి మధు చేయి పట్టుకున్నది.

• • •

రాజపురం జమీందారు భార్య పార్వతమ్మగారు తన అయిదేండ్ల ప్రాయముగల భారతిని భర్త చేతుల్లోబెట్టి కష్టంమీద కండ్లు మూసింది. భార్యా వియోగాన్ని సైతం లెక్కించక విజయ రామరాజు స్వర్గంలోనున్న భారతీ తల్లి ప్వారతమ్మ మనస్సుకు శాంతిచేకూర్చినాడు. బిడ్డలకు తల్లిలేని లోటు తీర్చాలంటే తండ్రి పడేకష్టా లెట్లాంటివో విజయరామరాజు ధైర్యంతో ఎదుర్కొన్నాడు. తన ఏకైక పుత్రిక భారతి రూపురేఖల్లోని విజయ రామరాజు పార్వతమ్మ ప్రతిబింబాన్ని చూస్తూండేవాడు. భారతి నవ్వినా, ఏడ్చినా, నడిచినా' అచ్చంగా పార్వతమ్మ ఛాయలే పడుతుంటాయి. అందుకనే, అరవైయ్యేండ్ల వృద్ధమూర్తి విజయ రామరాజుకు ప్రాపంచిక విషయ వాంఛలపై రోతపుట్టి, దీర్ఘవ్యాధితో పీడింపబడుచుండి నప్పటికీ, భారతిలోనే పంచప్రాణాలు పెట్టుకొని, కేవలం ఆమెకొఱకే జీవిస్తున్నాడు.

తండ్రి చల్లనిచూపుల్లో భారతి స్వేచ్ఛగా పెరిగి కోమలంగా పెద్దదైనది. సాలుకు డెబ్బది ఎనుబదివేల ఆదాయంకలిగి సర్వకాలములందు పాడి, పంటలతో, సుఖ సమృద్ధమై సాటి వూళ్ళల్లో మేటి యనిపించుకున్న రాజపురం జమీందారు ఏకమాత్ర పుత్రిక భారతి కోరికకు కొదువా, అభిలాషకు అడ్డూ అనేది కూడా ఒకటి వుంటుందా?

ఇతర విషయాల్లోవలెనే భారతి విద్యా విషయంలోకూడ జమీందారు చాలా శ్రద్ధతీసుకున్నాడు. చదువు సంధ్యల్లో భారతి ప్రబుద్ధురాలనిపించుకున్నది జమీందారీ పాఠశాల్లో ప్రాథమికశిక్షపూర్తిజేసి, చెన్నపట్నంలో మెట్రిక్యులేషన్‌వరకు చదివించాడు లలిత కళల మీద విజయ రామరాజుకు ఎక్కువ ప్రీతి ఒక మంచి విద్వాంసుని పర్యవేక్షణ క్రింద భారతికి నాట్యకళ సంగీతంలో మంచి సంస్కారాన్ని కలుగజేయించాడు.

జమీందారైన విజయ రామరాజు మొదటి నుండీ మంచి సంస్కారవాది, చరిత్ర సంపన్నుడు, గొప్ప దూరదృష్టిగల మేధావి జమీందారీ వారసత్వానికేగాక, భావిలో భారతికి పతి కాబోయే దత్తపుత్రుడగు రఘునాధుని పట్లనూ చాలా శ్రద్ధ తీసుకొన్నాడు. విజయ రామరాజు రఘునాధబాబుకు విదేశాల్లో విద్య గఱపించాడు. రఘునాధబాబు బారెట్లా ప్యాసుచేసి రాజపురంవచ్చి ఇంకనూ సంవత్సరం కూడా దాటలేదు. విజయ రామరాజు సలహా, సంకేతాల ననుసరించి జమీందారీ వ్యవహారాలన్నింటినిచూస్తూ తానే పెద్దగా వ్యవహరిస్తున్నాడు.

రఘునాధబాబు విదేశంనుండి వచ్చినాడు. వచ్చేప్పుడు తనవెంట కొన్ని పాశ్చాత్యదేశపు పద్ధతులనుగూడా భద్రంగా తీసుకవచ్చాడు. జమీందారీ వ్యవహారాలపై పెత్తనం తనచేతి క్రిందకు తీసుకొన్న మొదట్లో అతని పాశ్చాత్య పద్ధతులు ప్రజల్లో కొంచెం అలజడి కలిగించినవి. కానీ సూక్ష్మగ్రాహి కాబట్టి త్వరలోనే తనదారీ చక్క దిద్దుకున్నాడు. రఘునాధ బాబుయొక్క కుశల వ్యవస్థనూ, వ్యవహార నీతినిమాచి విజయ రామరాజు పూర్తిగా అధికారము సంతను అతని చేతుల్లోనేబెట్టి విశ్రాంతి తీసుకుంటున్నాడు.

వృద్ధ జమీందారు సంకేత పథంలో చక్క నిజోడుగా తయారయినారు రూపము, తెలివి తేటలు, చదువు అన్నిట్లోనూ చెరిసగం పంచుకొని పుట్టినారా? అన్నట్లు తోస్తుంది. అంతకంటే మరో సంతోష విషయమేమంటే ఇద్దరూ అధునిక శిక్షా దీక్షలకు, ఆచార వ్యవహారాలకు అలవాటుపడి అభ్యుదయ సమాజానికి అనువైన జంట

వృద్ధ జమీందారుపై ఇంకనూ ఒక భారము వున్నది - అది భారతీ రఘునాధుల పెండ్లి. మిగిలివున్న ఆకాస్తాకార్యం ముగించాడంతే అంతటితో తనపైనున్న తండ్రి బాధ్యతను కూడా అక్షరాలా నెరవేర్చుకొన్న వాడౌతాడు.

రఘు లండను ప్రయాణమగు నప్పటికి భారతికి పదునారేండ్లప్రాయం, పెద్దలు అపుడే భారతీ రఘునాధుల పెండ్లి తలపెట్టినారు. అయితే, రఘునాధు చదువు పూర్తిచేసి కానీ పెండ్లి చేసుకోనన్నాడు రఘునాధు అభీష్టాన్ని విజయ రామరాజు వ్యతిరేకించలేదు, పైగా హర్షించాడు, రఘు పరీక్ష పాసుచేసి రాజపురం తిరిగివచ్చు నప్పటికి అయిదేండ్ల కాలం పట్టింది. ఇపుడు భారతికి ఇరవయ్యోయేడు గడిచి

ఒకటిలోపడింది జమీందారు దేహస్థితికూడా అంత ఆశా జనకంగాలేదు. అందుకనే విజయ రామరాజు శుభముహూర్తానికై ఎదురు చూస్తు న్నాడు

భోజనా నంతరము విజయ రామరాజు మరియు, సాధుబాబా కూర్చొని ఆధ్యాత్మిక మైన విషయాలు చర్చించు కొనుచున్నారు. మాటల మధ్యన భారతివచ్చి మధును కళాశా లకు పంపించునట్లు చూడమని తండ్రితో సల హాచేసింది. ఇంతవరకు పడకకుర్చీలో పరుం డియున్న జమీందారు కొంచెం ముందుకు వంగి భారతితట్టుచూస్తూ అన్నాడు.



"అవునమ్మా! నాకు రఘు ఎంతనో మధు కూడా అంతే, మధు భవిష్యత్తును గురించి మొదటినుంచీ కనిపెట్టివున్నాను. మధు చాలా తెలివి తేటలుగల చురుకైనవాడు." సాధు బాబా తట్టుచూస్తూ జమీందారు మళ్లీ మొద లెట్టాడు.

"అనాధ శిశువును చేతుల్లోపెట్టుకొని బాబా గారు మన ఆశ్రయానికి వచ్చినారు. మధు పోషణలో పూజ్యులగు బాబాగారికి ఏమాత్రం సహాయపడినా నేను ధన్యుణ్ణి కాగలను. బాబాగారు ముక్తసంగులు, తప స్సంపన్ను లు, వారి సత్సంగానికే నేను అనర్హుడను, కానీ ఒక్క విషయంలో ఇపుడు ఇద్దరమూ ఒక పంధాననడిచే పధికులమే, ఎంతకాలం నుండి నాకు నా అంతరాత్మ ప్రబోధానికి నీవు యెంత అంతరాయంగా ఉంటున్నావో, బాబా గారికి మధుకూడా నంతే. బాధ్యతవల్ల ఏర్ప డిన, యీ ప్రతిబంధకాన్ని ఎంత తొందరగా దూరం చేసుకోగలమో, అంత త్వరలోనే మేము మా అభీష్టస్థలానికి పోగలం"

ఇంతవరకు కన్నులు మూసుకొని నిశ్శ బ్దంగా వింటూవున్న బాబాగారు నవ్వుతూ అన్నారు.

"తమరు తలచినట్లు, మానవునికి మాన వునివల్ల ఏర్పడిన, బాధ్యతాయుతమైన ప్రతి బంధకం, అంత సులువుగా తొలగించుకుంటే తొలగిపోవునది కాదు. నానంగతే తీసుకొనండి తమ కృపవల్ల మధు ఒకవ్యక్తి కాగలిగాడు. స్థూలవృద్ధికి ఇక అతనిపై నేను ధర్మకర్తృ త్వము వహించడం అంత ఉచితంగా కన్ప డదు ఏదోనిర్జన స్థలానికివెళ్లి నా పూర్వసాధ నలో శాంతిమయ జీవితాన్ని గడుపుకొనవచ్చు ను. అయితే ఇంత దీర్ఘకాలముయొక్క సం పర్కంలోంచే ఉద్భవించిన మానవ సహజ మైన మమకారాన్ని, లేదా తమరు దాన్ని ప్రతి బంధకమే యనండి నేను వదలుకోగలనా యని నా సందేహం."

సాధు బాబాగారి అభిప్రాయాన్ని సమర్థిస్తూ భారతి అన్నది

"అవును, బాబాగారు చెప్పినది అక్షరాలా నిజం శారీరకంగా దూరులైనంత మాత్రం చేత మనుష్యోచితమైన మమత, దూరంకాదు అది యేదో ఒక రూపంతో మన కార్యకలా పాల్లో ప్రతి బింబితమగుచునే యుండును. నాన్న అంటూంటాడే గానీ, ఇప్పటికి అమ్మ చచ్చిపోయి ఎన్నో సంవత్సరాలైంది ఇంత కాలం గతించినా నాన్న ఆమెను మరువలేకు న్నాడు. అమ్మఫోటో ఎపుడైనా కండ్లకు కన బడిందంటే చాలు! యింకేమున్నది? మళ్లీ మనిషే కాదు"

అంటూ భారతి నాన్న ముఖంకిచూచి మృ దువుగా నవ్వింది. భారతి మాటలకు జమీం దారు ముఖంలో క్షణకాలం నవ్వుపుట్టి, మా యమయింది. వెంటనే ఏదో విచారాన్ని జ్ఞప్తి కితెచ్చుకుంటూ ఇలా అన్నాడు.

"పిచ్చితల్లీ! అలా అనకు నిన్ను గురించి మీ అమ్మచేసిన ఆదేశమే నన్ను బంధించ కుండినట్లయిన ఈవేళకు యే హృషీకేశంలో నో లేక హరిద్వారంలోనో వుండి వుందును."

"ఆ నేను చెప్పునదదే నాన్నా! ఏదో ఒక అజ్ఞాత ఆ దేశంచే మీరు ఈ ప్రకారం బంధింప బడి వున్నారు గానీ, లేకుంటే ఈ నా టికి ఏ ప్రవరాఖ్యుని వలె ఎగిరి పోయి వుంద రో"

విషయము యొక్క గంభీరత ఎగతాళిగా మారింది. సాధుబాబా నవ్వుతూ ఏదోచెప్ప బోవుచుండగా జమీందారు కుర్చీలోంచి పైకిలేస్తూ అన్నాడు దృఢ స్వరంలో

"నీవే చూస్తావు చూడు భారతీ!"

నానిశ్చియం చాలా తీవ్రమైనదిగా వుంటుంది నీకూమరి రఘుకూ రేపు మీ అమ్మ సాంవత్సరీకం గడచి పోతూనే పెండ్లిడ్లు చేసేసి బాబా గారివెంట హరిద్వార మెళ్లి దైవ ధ్యానంలో మిగతకాలాన్ని గడపేస్తూ శరీరాన్ని వదలడం ముమ్మాటికీ నిజం.

తన పెండ్లిని గురించి మాట్లాడు నప్పుడు భారతికి యేమంత ఆశ్చర్యం కలుగలేదు, ఏమంటే నాన్న దగ్గర కనీసం ఈ మాట రోజుకో సారియైనా వింటూ వుంటుంది మధు పెండ్లి మాట ఎత్తు నప్పటికి ఏదో నవీన శక్తి ఒక్కసారి తన శరీరాన్ని ఝుళిపించి నట్లు తోచింది,

జమీందారు మళ్లీ ప్రారంభించారు

"మధును మద్రాసు పంపించి కళాశాల్లో ప్రవేశ పెట్టడం కంటే పెండ్లిచేసి మన దివాణంలోనే వుంచుకుంటే రఘుకు తోడు నీడగా ఇద్దరూ ఒక రింకొకరికి సహాయ భూతులుగా వుండ గలరు.

నేటి కాలేజి వాతావరణం యువకుల అభివృద్ధికి అంత సహకారి గాదు. మన దేశములో నుండు ఇప్పటి కాలేజీలు అర్థం శూన్యములైన ఆందోళన సమాజములుగా మారిపోయి, మత్తు వాతా వరణంతో నిండి వున్నది. పైగా మన మధువంటి మన స్తత్వం గల వారిని కాలేజీ గాలి ఉన్మాదులనుగా మార్చేస్తుంది.''

భారతి అడ్డుపడి

"కాదు నాన్నా! స్వేచ్ఛగా సంచరించ వీలు కలుగచేసి నపుడే వ్యక్తి తన బాధ్యత ఏమిటో సంపూర్ణముగా గ్రహించ గలడని మీరే ఒక మారు చెప్పారు గదా?,,

"స్వేచ్ఛను అనుభవించ టానికైనా ఒక విధమగు ఆత్మ బలము అవసర మమ్మాయీ! స్వేచ్ఛా శబ్దానికి యీ నాడు మీరిచ్చే పరి భాష వింటేనే నాకు భయమేస్తుంది, ఏమండీ! మధు విషయమై మీ అభి[illegible]య మేమిటి?" జమీందారు బాబావైపు జూచి అడిగాడు

బాబాగారు నగుచూ—

"మధును గురించి ఇచ్చేమన సలహాలు భారతీ దేవి ఎదుట ఏమీ సాగవండోయ్" అన్నాడు

"అవును ఈ విషయమై ముందు రఘు అభిమత మెట్లున్నదో కూడా కనుక్కోవడం ఉచితమనుకుంటాను. ఏమొచ్చినా మునలోళ్లమైన మనం సలహా ఇచ్చే వాళ్లమేగా. ఏదో వెంటనే తెలుసు కోవడం మంచిది.',

అంటూ "అమ్మా! రఘు బాబును కాస్తవచ్చి పొమ్మని ఎవరితోనైనా కబురు చేయించు" భారతితో జెప్పాడు జమీందారు.

భారతి రఘు నాథ బాబు ఆఫీసుకు మనిషిని పంపించి, తాను తోటలోనికి వెళ్లిపోయింది. ఇందును గురించి రఘు నాథ బాబు ఉద్దేశ్యమెట్లుండునో ఆమెకు బాగాతెలుసు మృదు యెడ రఘునాథునకు సదభిప్రాయంలేదు.

"సమ్మెలు చేయటంలో బాగా శిక్షణ పొందుటకు, నినాదములు చేస్తూ అమాయకప్రజను ఉద్రిక్తులను జేసి ఉసి కొల్పేందుకు పికెటింగుచేసే నవీన పద్ధతులేమైనా ఉంటే నేర్చుకొని రమ్మని చెప్పటానికా మధును మద్రాసు పంపడం,, అని రఘు తప్పక అంటాడని ఆమె సంకల్పం. తొందర పడి మధు విషయమైనప్రస్తావన వీళ్లముందు యెందుకుపెట్టానా? అని ఆమె విచార పడింది నిరుద్దేశంగా భారతి తోట లోనికిపోయింది. తోటలో గుబురుగా పెరిగి వున్న ఒక చిన్నచెట్టు దగ్గర నిలబడి కొంచెము దూరంలో పనిచేసే తోటమాలి తట్టు చూస్తూ వుండి పోయింది.

మాలి తాను కష్టపడి నీళ్లు పోసి, పాదిచేసి, ప్రేమతో పెంచిన చెట్ల కొమ్మలను తానే నిర్దయతో కత్తరించి వేస్తున్నాడు, మాలి కాఠిన్యానికి ఆమె మెత్తని మనస్సు చాలా నొచ్చుకున్నది అదే విధంగా చూస్తూ ఒక ఘంటసేపు గడిపేసింది.

ఆలోచనతో ఇంతలో ఆమె ఆశ్చర్యపడి చూచింది! ఆమెకు తెలియకనే ఆమె చేతులు చెట్టులో అందిన ఆకుల్ని, పూల మొగ్గల్ని గోళ్ళతోగిల్లి, క్రింద కుప్పబోసి పెట్టినాయి:

తోటమాలి భారతి దగ్గరకు కట్టెపూత పరచుకుంటూవచ్చి భయపడతూ అన్నాడు.

"యెందుకు తల్లీ, పూలూ, ఆకులు, అలా దూసిపోశారు."

'చిన్న పిందెలులే, మాలీ" అని ఆమె క్రిందనున్న ఆకులను కాళ్ళతో రాకుతూ వెళిపోయింది. మునలి మాలి గొణిగాడు.

"నేటి మొగ్గ, రేపు, పూవగును."

[వచ్చే సంచిక మిగత.]